

నగదు పట్టివేత

జన్నారం, మార్చి 18: మండలంలోని ఇందన్‌పల్లిలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద సోమవారం ఓ వ్యాన్‌లో తరలిస్తున్న రూ. 1,05,900 నగదును పట్టుకున్నట్లు లక్సెట్టిపేట సీఐ నరేందర్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వాహనాల తనిఖీల్లో భాగంగా ఓ వ్యాన్‌లో నగదు పట్టుబడడంతో సీజ్ చేశామని తెలిపారు.



ఇఫ్తార్ | 6:28
మంగళవారం
సహర్ | 4:59
బుధవారం

కాంగ్రెస్‌లో పెరుగుతున్న ఆశావహులు

- ఎంపీ టికెట్ కోసం పోటాపోటీ
- నేడు అభ్యర్థిని ప్రకటించే అవకాశం
- ప్రశ్నార్థకంగా సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్‌నేత భవితవ్యం

మంచిర్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత కాంగ్రెస్ నుంచి ఎంపీ టికెట్ ఆశించే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్‌ఎస్‌లు పెద్దపల్లి పార్లమెంటు స్థానానికి ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించాయి. కాగా కాంగ్రెస్ ఇంకా నాన్పుడు ధోరణి అవలంబిస్తుండడంతో ఆశావహుల్లో కొత్తవారి పేర్లు తెరపైకి వస్తున్నాయి. పెద్దపల్లి పార్లమెంటు స్థానం కింద ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉండగా, అన్ని స్థానాలను కాంగ్రెస్ గెలుచుకున్నది. కాంగ్రెస్ అధిష్ఠానం పార్లమెంటు స్థానాన్ని సైతం కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది.



బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రకటనతో..

పెద్దపల్లి పార్లమెంటు స్థానానికి బీజేపీ, బీఆర్‌ఎస్‌లు తమ అభ్యర్థులను ప్రకటించినందున కాంగ్రెస్ కూడా ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. ఈ విషయమైన ఢిల్లీలో సోమవారం నిర్వహించిన స్క్రీనింగ్ కమిటి సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ నెల 19న కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించనున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ..

పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి పోటీ పడే పలువురు ఆశావహుల పేర్లు ఇప్పటికే తెరపైకి రాగా, టికెట్ ఎవరిని వరిస్తుందో నన్న ఉత్కంఠ పార్టీ శ్రేణుల్లో ఉంది. పెద్దపల్లి స్థానం ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వు కావడంతో పలువురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. టికెట్ ఆశిస్తున్న వారిలో ప్రధానంగా మాల సామాజిక వర్గాని కి చెందిన మాజీ ఎంపీ కాకా వెంకటస్వామి మనవడు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద తనయుడు గడ్డం వంశీకృష్ణ, నేతకాని సామాజిక వర్గానికి చెందిన సిటింగ్ ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ డాక్టర్ సుగుణకుమారి, ప్రముఖ వ్యాపారవేత్త, మైత్రి రిసార్ట్స్ అధినేత ఆసంపల్లి శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి పెర్క శ్యామ్, టీపీసీసీ సభ్యుడు ఊట్ల వరప్రసాద్ కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

సిట్టింగ్ ఎంపీకి దక్కేనా?

పెద్దపల్లి పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ నుంచి విపరీతమైన పోటీ నెలకొనడం, సిట్టింగ్ ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేతకు టికెట్ దక్కేనా అన్న ప్రశ్నలు సర్వత్రా ఉత్పన్నమవుతున్నాయి. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడిన ఆయన బీఆర్‌ఎస్‌లో చేరి ఎంపీగా గెలు పొందారు. ప్రస్తుత ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో బీఆర్‌ఎస్‌ను వీడి ఫిబ్రవరి 6న తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ టికెట్ ఆయన్నే వరిస్తుందన్న ప్రచారం తెరపైకి వచ్చింది. ఇటీవలి కాలంలో పార్టీ నుంచి ఆశావహుల సంఖ్య పెరగడంతో టికెట్ ఎవరిని వరిస్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.



కలెక్టరేట్ ఎదుట భూ నిర్వాసితుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎన్‌హెచ్-63 భూ నిర్వాసితులు

నస్పూర్, మార్చి 18: జాతీయ రహదారి-63 (గ్రీన్‌ఫీల్డ్ హైవే) నిర్మాణం వల్ల తాము తీవ్రంగా నష్టపోవాల్సివస్తోందని, 2018లో ఇచ్చిన అలైన్‌మెంట్ ప్రకారం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాలకు చెందిన పలువురు రైతులు నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. గ్రీన్‌ఫీల్డ్ వద్దు-పంటపొలాలే ముద్దు అంటూ నిర్వాసిత రైతులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసిత రైతులు మాట్లాడుతూ గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం వలన సర్వస్వం కోల్పోయామని చెప్పారు. మళ్లీ విలువైన భూములను ఇచ్చి భూ నిర్వాసితులం కాబోమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో ఇచ్చిన అలైన్‌మెంట్‌ను ఎందుకు మార్చారని ప్రశ్నించారు. కొందరు రాజకీయ నేతల ఒత్తిళ్ల కారణంగా అలైన్‌మెంట్‌లో మార్పులు జరిగాయని వాపోయారు. పాత పద్ధతిలో పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. చాలా మంది పేదలు కష్టపడి భూములను కొనుగోల చేసి జీవనం సాగిస్తున్నారని అన్నారు. అలాంటి వారికి ఉపాధి లేకుండా చేసేందుకు కొందరు నేతలు యత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా పోలీసుల నిర్బంధంలో భూములను తీసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. వెంటనే విరమిం చుకోవాలని కోరారు. ఆందోళనలో రైతులు ఓడ్నాల శ్యాంసుందర్, బొల్లం భీమయ్య, జనార్దన్‌రెడ్డి, పెట్టం తిరుపతి, కొండల్ రెడ్డి, లత, రూప, కమల తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల మహిళలకు అవగాహన

మందమర్రిరూరల్, మార్చి 18: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ యూనిఫాం కుట్టడంపై పొదుపు సంఘాల మహిళలకు సోమవారం ఎంపీడీవో కార్యాయలంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీపీఎం సంజీవ్ మాట్లాడుతూ ప్రభు త్వం ఒక్కో యూనిఫాంకు రూ. 50 చెల్లిస్తుందని సూచించారు. ఆసక్తి గల మహిళలు ముందుకు రావాలని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇతర ప్రభుత్వ శాఖల నుంచి యూనిఫాంలు కుట్టడానికి మహిళ సంఘాలకు ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. కాగా కొందరు మహిళలు ఇంత తక్కువ రేటుకు కుట్టడం సాధ్యపడదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రఘురాం, ఏపీఎం లలితకుమారి, ఉపాధ్యాయుడు సదయ్య, సీసీలు మోహన్‌చారి, సునీత , పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ గొర్రెలు అందజేయాలి

మందమర్రిరూరల్, మార్చి 18 : కుర్మ కులస్తులకు సబ్సిడీ గొర్రెలను అందజేయాలని సోమవారం కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంట శ్రీశైలంకు కుర్మ కులస్తులు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం కుర్మలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలని గొర్రెలను పంపిణీ చేసిందన్నారు. చాలా మంది డీడీలు కట్టి గొర్రెల కోసం ఎదురుచూస్తున్నారని, వెంటనే ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మధు, ఉపాధ్యక్షుడు రంజిత్, ప్రచార కార్యదర్శి సత్యనారాయణ, రమేష్, గంగారం, నరేష్, రామన్న కొమురయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మందమర్రిరూరల్, మార్చి 18: మండలంలోని మామిడిగట్టు గ్రామంలో గత బుధవారం ఆత్మహత్యకు పాల్పడిన నాంపల్లి సంగీత కుటుంబాన్ని సోమవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పరామర్శించారు. సంగీత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. ఆయన వెంట ఒడ్నాల కొమురయ్య, గండె రాంచందర్ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మందమర్రిరూరల్, మార్చి 18: మండలంలోని చిర్రకుంట గ్రామంలో రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన లక్ష్మణ్ ఆటో ట్రాలీలో 3.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అభ్యర్థులు ప్రచార వివరాలు అందజేయాలి

- ప్రజలను మభ్య పెట్టే అంశాలపై అధికారులు దృష్టి సారించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 18: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లా పరిధిలో వివిధ రాజకీ య పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులకు సంబంధించి మొబైల్ నెట్‌వర్క్‌లలో బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్‌కాల్స్‌మెసెజ్‌ల ద్వారా చేసే ప్రచార వివరాలను అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాల యంలో మొబైల్ నెట్‌వర్క్‌ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీకయ పార్టీల అభ్యర్థులు బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ కాల్స్‌మెసెజ్‌ల ప్రచారం కోసం మొబైల్ నెట్‌వర్క్‌లను సంప్రదించినప్పుడు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ , మానిటరింగ్ కమిటీ కార్యాలయంలో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. నెట్ వర్క్ పరిధిలో జరిగే ప్రచార సంబంధిత పూర్తి వివరాలతో ఎప్పటికప్పుడు నివేదికలు అందించలని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఈ డిస్ట్రిక్ మేనేజర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

-ఎన్నికల ప్రవర్తనా నియామవళి పాటించాలి

ఎన్నికల ప్రవర్తనా నియామవళిని కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌లు రాహుల్,మోతిలాల్, ఏసీపీ ప్రకాష్‌లతో కలిసి ఆబ్కారీ, బ్యాంకు, ఆదాయపన్ను, రవాణా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలను మభ్య పెట్టే నగదు, మద్యం, కానుకలు రవాణా అరికట్టేందుకు చెక్‌పోస్టుల ఏర్పాటుతో పాటు ఫ్లైయింగ్‌స్క్వాడ్, సర్వేయలెన్స్ బృందాల సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. జిల్లా పరిధిలో రూ. 50 వేల కంటేఅధికంగా నగదు తరలిస్తే తగిన ఆధారాలు లేకపోతే సీజ్ చేస్తామని తెలిపారు. సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు అందిన వంద నిమిషాల్లో పరిష్కరించాలన్నారు. ఆబ్కారీ శాఖ అధికారులు మద్యం దుకాణాల్లో మద్యం నిల్వలను తనిఖీ చేయాలని, బెల్టు షాపులను నియంత్రించాలని సూచించారు. అభ్యర్థులకు సంబంధించిన బ్యాంకు లావాదేవీల విషయంలో ఏమైనా అనుమానాలు ఉంటే సంబంధిత బ్యాంకర్ల సహాయాంతో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఆబ్కారీ మద్యనిషేధ శాఖ అధికారి నందగోపాల్, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, జిల్లా రవాణా శాఖ అధికారి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

- మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి

నస్పూర్, మార్చి 18: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నస్పూర్‌లో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా సోమవారం ఆయనను నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ), ప్రెస్‌క్లబ్ సభ్యులు, మంచిర్యాల పట్టణ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ అర్హులైన జర్నలిస్టుందరికీ ఇంటి స్థలాలతో పాటు ఇళ్లను ఇవ్వడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అలాగే హెల్త్‌కార్డుల సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. చైర్మన్‌గా ఎన్నికైన తరువాత ఈ ప్రాంతానికి తొలిసారిగా వచ్చిన శ్రీనివాస్ రెడ్డిని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు దేగ సత్యం, ప్రధాన కార్యదర్శి పింగిళి సంపత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపిరెడ్డి ప్రకాష్‌రెడ్డి, కోశాధికారి వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడు సంజీవ్, సీనియర్ జర్నలిస్టులు సురేష్ చౌదరి, ఆకుల రాజు, ఇతర సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి శ్యామ్‌సుందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మద్దుల మనోహర్ రెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, నరేందర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు రాజ్‌కుమార్, నారాయణరెడ్డి, రవి, రాజేశం, రాజేష్, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బ్యాంకుల పరిధిలో జరిగే అనుమానిత నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు పరిధిలో లక్ష రూపాయల కంటే ఎక్కువగా నగదు జమ అయినా, తీసుకున్నా వివరాలను ఎన్నికల ఖర్చుల పరిశీలకులకు అందించాలన్నారు. ఒకే ఖాతా నుంచి వివిధ ఖాతాలకు నగదు తరలింపు జరిగిన వివరాలను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి మాజీ ఎమ్మెల్సీ పురాణం?



పురాణం సతీష్‌కుమార్

కోటపల్లి, మార్చి 18: ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ త్వరలోనే కారు దిగి కాంగ్రెస్ గూటికి చేరుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అసెంబ్లీ ఎన్నికలకుముందే ఈయన పార్టీ మారేందుకు సన్నాహాలు చేసినప్పటికీ మనసు మార్చుకుని గులాబీ పార్టీలోనే కొనసాగారు. ఎమ్మెల్సీగా ఆయనకు మరోసారి అవకాశం కల్పించకపోవడంతో అప్పటి నుంచి ఆయన పార్టీ ముఖ్య కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఇప్పటికే పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత కాంగ్రెస్ గూటికి చేరారు. అదే దారిలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ సైతం కాంగ్రెస్ గూటికి చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో సత్సంబంధాలు కలిగి ఉన్న పురాణం త్వరలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. ఈ దశలో భాగంగానే సోమవారం హైదరాబాద్‌లో నియోజకవర్గానికి చెందిన పలువురు మాజీ సర్పంచులు , ఎంపీటీసీలు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు ,చైర్మన్‌లతో పాటు ఇతరత్రా ముఖ్య అనుచర గణంతో ఆయన సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఇక రెండు మూడు రోజుల్లో కాంగ్రెస్ గూటికి చేరేందుకు ముహూర్తం సైతం ఖరారు చేసుకున్నట్లు సమాచారం.

నిధులు కేటాయించాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 18: మంచిర్యాల బ్లడ్ బ్యాంకు శాఖ నిర్వహణకు నిధులు కేటాయించాలని జిల్లా శాఖ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్ రావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కోటిరెడ్డిని మంచిర్యాల జిల్లా సభ్యులు కలిశారు. వారికి నూతనంగా ఎన్నికైన మంచిర్యాల జిల్లా శాఖ కార్యవర్గ సభ్యుల వివరాలు, ఎన్నికైన కార్యవర్గ సభ్యుల మొదటి సమావేశ తీర్మానాల కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి మంచిర్యాల శాఖకు కావాల్సిన సదుపాయాలు, అవసరాల గురించి వారికి వివరించారు. కేంద్రీకృత బ్లడ్ బ్యాంకు మేనేజ్‌మెంట్ సిస్టం సాఫ్ట్‌వేర్‌కు కావాల్సిన బడ్జెట్‌ను అందించాలని కోరారు. త్వరలోనే రూ. 3 లక్షల బడ్జెట్ విడుదల చేయడానికి అంగీకరించినట్లు భాస్కర్‌రెడ్డి తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన మద్యం స్వాధీనం

మందమర్రిటౌన్, మార్చి 18: పట్టణంలోని బెల్టుషాపులో ఆకస్మికంగా దాడులు చేసి మద్యాన్ని పట్టుకున్నామని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. 1వ జోన్‌కుచెందిన కొనగంటి సురేష్ కిరాణం షాపులో అక్రమంగా నిల్వ చేసిన 74.91 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సై రాజశేఖర్ సిబ్బంది ఉన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్..

జైపూర్, మార్చి 18: పెగడపల్లిలో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నామని తహసీల్దార్ వనజారెడ్డి అన్నారు. ఈ ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా మట్టి, ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

లక్సెట్టిపేటరూరల్, మార్చి 18: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని జాతీయపర్యావరణ విద్యా సమన్వయకర్త , తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో నీటి జాడ దాని వినియోగం, ప్లాస్టిక్ వినియోగ నివారణ అనే అంశంపై సమీకృత ఉపాధ్యాయ విద్యా విభాగం నిర్వహించిన జాతీయ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ అకాడమిక్ నెట్‌వర్క్ అధ్యాపకురాలు పద్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా, ప్రోగ్రాం సమన్వయకర్త పడాల తిరుపతి, వైస్ ప్రిన్సిపాల్ గంగయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలు ప్రారంభం

- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- కేంద్రాలను పరిశీలించిన ఈడీవో యాదయ్య



నస్పూర్‌లో పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

ఏసీసీ, మార్చి 18: మంచిర్యాల జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్ష మొదటి రోజు సోమవారం సజావుగా జరిగింది. ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్‌కు జిల్లా వ్యాప్తంగా 52 పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 9,293 మందికి గానూ 21 మంది గైర్హాజరయ్యారు. మొత్తం విద్యార్థుల్లో హాజరైన వారు 99.70 శాతం. డీఈవో యాదయ్య జిల్లా కేంద్రంలోని చెన్నూరు రోడ్డు పాఠశాల, ఆర్‌బీహెచ్‌వీ పాఠశాల, జడ్పీ బాలుర పాఠశాల, కృష్ణవేణి పాఠశాలలతో పాటు మందమర్రిలోని సింగరేణి ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షల తీరును పరిశీలించారు. అసిస్టెంట్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఎగ్జామినేషన్ నాలుగు పరీక్ష కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 17 పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్షరాస్తున్న విద్యార్థులను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని సాయికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం విద్యార్థులకు హాల్‌టికెట్లలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల మంచిర్యాల అని పేర్కొనడంతో విద్యార్థులు తీవ్ర అయోమయానికి గురయ్యారు. మంచిర్యాల పట్టణంలో మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండడంతో ఏ ప్రాంతం పాఠశాలో హాల్‌టికెట్‌లలో స్పష్టంగా పేర్కొనకపోవడంతో పలువురు ఇబ్బందులు పడ్డారు. ఇక ముందు అయినా హాల్‌టికెట్‌లో పరీక్ష కేంద్రం పేరు, ప్రాంతాన్ని స్పష్టంగా పేర్కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. జిల్లా వ్యాప్తంగా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని అధికారులు వెల్లడించారు.

నస్పూర్: నస్పూర్ పట్టణంలోని తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ హైస్కూల్, సీసీసీ సింగరేణి హైస్కూల్, ఆక్స్‌ఫర్డు స్కూల్ కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభ మైయ్యాయి. మూడు కేంద్రాల్లో 504 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం పరీక్ష సమయానికి ముందుగా విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతించారు.

జైపూర్: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో రాధాకృష్ణ అన్నారు. మొత్తం 384 మంది విద్యార్థులకు గాను 383 మంది హాజరయ్యారని తెలిపారు.

దండేపల్లి: దండేపల్లి ఉన్నత పాఠశాల, లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలోని సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల విద్యాధికారి కాసుల రవీందర్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

మందమర్రి టౌన్: పట్టణంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాలను సీఐ శశిధర్ పరిశీలించారు.

కోటపల్లి: మోడల్ స్కూల్, పారుపెల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంఈవో తిరుపతిరెడ్డి పరిశీలించారు.

తాండూర్: మండలంలోని తాండూర్ జడ్పీఎస్ఎస్ పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థులు, విద్యాభారతి పాఠశాల పరీక్ష కేంద్రంలో 201 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను సీఐ కుమారస్వామి పరిశీలించారు.



మంచిర్యాలలో పరీక్షా కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు

కాసిపేట: మండలంలో మొత్తం 373 మంది విద్యార్థులకు మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అధికారులు కేంద్రాలను తనిఖీ చేశారు.

కన్నెపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగింది, 130 మంది హాజరై పరీక్షలు రాశారు.

భీమిని: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొదటి రోజు 94 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రావు, డిపార్టుమెంట్ అధికారి రమేశ్ తెలిపారు. తహసీల్దార్ భిక్షర్లదాస్, ఎస్సై విజయ్ కేంద్రాలను పరిశీలించారు.

భీమారం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 127 మంది విద్యార్థులకు 127 మంది హాజరై పరీక్ష రాసినట్లు ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.



కోటపల్లిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



దండేపల్లిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

'కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఎస్సీలకు అన్యాయం'

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 18: కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 37 కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఎస్సీల వాటా విస్మరించి మాలలను అవమాన పరిచిందని మాలమహానాడు ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాలలను పట్టించుకోవడం బాధగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పునరాలోచించి మాలలకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం దీనిపై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో నాయకులు పులయల్లయ్య, ప్రభాకర్, యాదగిరి, గంగారాం, మహేందర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మటన్ విక్రయ దుకాణాల్లో తనిఖీలు

లక్షెట్టిపేటరూరల్, మార్చి 18: లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని కరీంనగర్ చౌరస్తాలో ఉన్న మటన్ షాపుల్లో సోమవారంమున్సిపల్ వెటర్నరీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనారోగ్యంతో ఉన్న మేకల మాంసాన్ని విక్రయిస్తున్నారని గుర్తించి పశువైద్యాధికారి ధన్‌రాజ్ ఆధ్వర్యం లో పంచనామా చేసి సీజ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అజీమ్, సిబ్బంది దినేష్, అశోక్, రాకేష్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

లక్షెట్టిపేటరూరల్, మార్చి 18: ఎన్నికల నియమావళిని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని తహసీల్దార్ రాఘవేంద్రరావు సూచించారు. లక్షెట్టిపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్సై చంద్రకుమార్, ఎంపీడీవో సరోజ, మున్సిపల్ కమీషనర్ రాజశేఖర్, ఎంఈవో రవీందర్, విద్యుత్ ఏఈ గణేష్, ఏపీఎం లక్ష్మి, ఏపీవో వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ సభకు తరలివెళ్లిన నాయకులు

దండేపల్లి, మార్చి18: జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహిం చిన ప్రధాని నరేంద్రమోదీ విజయ సంకల్ప భారీ బహిరంగ సభ కార్యక్రమానికి సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వ ర్యంలో మండల నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోపతి రాజయ్య ,బందెల రవిగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రజినేష్‌జైన్ పాల్గొన్నారు.

ప్రగతి మైదానం పనులు పూర్తయ్యేదెన్నడో?

- మూడు నెలలైనా పూర్తికాని మరమ్మతులు
- పట్టించుకోని అధికారులు



శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానం

శ్రీరాంపూర్, మార్చి 18: శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానం మరమ్మతు పనులు మొదలై మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు పూర్తి కాలేదు. గతేడాది డిసెంబరు 14వ తేదీన కోల్ ఇండియా హాకీ పోటీలు నిర్వహించేందుకు సింగరేణి సిద్ధమైంది. ఈ పోటీలకు దేశవ్యాప్తంగా ఉన్న వివిధ బొగ్గు పరిశ్రమలకు చెందిన జట్లు, క్రీడాకారులు వచ్చే అవకాశం ఉంది. ఈ తరుణంలో శ్రీరాంపూర్ డివిజన్‌లో సంబంధించిన వసతులు ఉండడంతో ఇక్కడ ఏర్పాట్లు చేసేందుకు యాజమాన్యం ఆదేశిం చింది. ఈ ఏరియా అధికారులు శ్రీరాంపూర్ స్టేడియంలో ఏర్పాట్లు ప్రారంభించారు. అంతకుముందు ఉన్న గ్రౌండ్‌ను పూర్తిగా తవ్వించి హాకీ ఆడేందుకు వీలుగా మట్టి పోసి చదును చేసే పనులు చేపట్టారు. కానీ ఏమైందో ఏమోగానీ క్రీడల నిర్వహణ వేదిక భూపాలపల్లికి మారిపోయింది. అక్కడ జనవరి 18 నుంచి నాలుగు రోజుల పాటు పోటీలు జరిగాయి. ఈ నేపథ్యంలో డిసెంబర్ 23న సింగరేణి ఆవిర్భావ వేడుకలు రావడంతో శ్రీరాంపూర్ స్టేడియంలో అప్పటి అవసరానికి అనుగుణంగా మట్టిని పోసి అటూ, ఇటూ నెట్టి పనులు పూర్తయ్యాయనిపించారు. సంబరాలు పూర్తి చేసుకున్నారు. కానీ ఆ తరువాత అధికారులు గ్రౌండ్ గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. దీనివల్ల ఒకవైపు సరిగ్గానే ఉన్నప్పటికీ మరోవైపు ఎగుడుదిగుడుగా తయారైంది. మైదానంలో రోజు ఆటలు ఆడే క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణి అధికారులు స్పందించి మైదానం పనులు త్వరగా పూర్తి చేసి క్రీడలు ఆడుకునేందుకు అనుకూలంగా సిద్ధం చేయాలని వారు కోరుతున్నారు.

రాచకొండ చందనకు ఉత్తమ రైతు అవార్డు

ఏసీసీ, మార్చి 18: మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన రాచకొండ చందన గ్రామ భారతి వ్యవసాయ ఉత్పత్తి దారుల కో ఆపరేటివ్ సొసైటీ నుంచి ఉత్తమ రైతుగా అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రప తి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ మూడేళ్లుగా సేంద్రియ పద్ధతిలో దేశవాళీ విత్తనాలతో వ్యవసాయం చేస్తూ ముందుకు సాగుతున్నాన్నారు. తనకు అవార్డు రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

నియామకం హర్షణీయం

ఏసీసీ, మార్చి 18: మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య రాష్ట్ర చైర్మన్‌గా మెట్టు సాయిని రాష్ట్ర ప్రభుత్వం నియమించడం హర్షణీయమని గంగపుత్ర సంఘం నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు.

పిల్లలకు అన్నప్రాసన

కన్నెపల్లి, మార్చి 18: కన్నెపల్లిలోని 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పిల్లలనకు అన్నపాసన నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఇందిర గర్భిణులు, తల్లులకు పోషకాహారం, ముర్రుపాలు , చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆరు నెలలు నిండిన పిల్లలకు అదనపు ఆహారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, అనిత, సరిత, భీంబాయి, ఆయాలు భూమక్క, ప్రమీల, విజయ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తాండూర్, మార్చి 18: మండలంలోని రేపల్లెవాడ గ్రామ సమీపంలో ఏర్పాటుచేసిన జిల్లా సరిహద్దు చెక్ పోస్టు వద్ద సోమవారం తాండూర్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి వాహనాలను తనిఖీచేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు పాటించాలన్నారు. వాహనాల్లో నగదు, మద్యం సరఫరాచేస్తే కఠినచర్యలు ఉంటాయని తెలిపారు. సీఐ వెంట బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం సూపరింటెండెంట్ పోచయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన



చెన్నూరులో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

- ఎంపీవోపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

చెన్నూరు, మార్చి 18: నాగర్‌కర్నూలు జిల్లా కోడేరే ఎంపీవో శ్రావణ్‌కుమార్‌పై ఎంపీపీ రాదసుధాకర్‌రెడ్డి దాడి చేసినందుకు నిరసనగా సోమవారం పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అలాగే మధ్యాహ్న భోజన సమయంలో చెన్నూరులోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ, కోటపల్లి ఎంపీవో అక్తర్ మొయినోద్దీన్ ,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జైపూర్: జైపూర్ ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయం సిబ్బంది భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీవోపై మండల పరిషత్ అధ్యక్షులు దాడి చేయడం అమానుషమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడి చేసిన మండల పరిషత్ అధ్యక్షుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జన్నారం: ఎంపీడీవో కార్యాలయం ఎదుట మండల పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భీమిని: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీవో, ఇన్‌చార్జీ డీఎల్‌పీవో, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీవోపై దాడి చేసిన దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాసకాలనీ పనులు వేగవంతం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న కోదండరాం

కాసిపేట, మార్చి 18: దుబ్బగూడెం పునరావాకాలనీలో చేపట్టే పనులు వేగవంతం చేయాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నా రు. సోమవారం ఆయన దుబ్బగూడెం పునరావాసకాలనీ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళ్యాణిఖని మెగా ఓసీపీలో భూములు, ఇళ్లు కోల్పోయిన దుబ్బగూడెం నిర్వాసితులకు నష్టపరిహారం అప్పుడు తక్కువగా చెల్లించారని చెప్పారు. కానీ పునరావాస నిర్మాణ పనుల్లో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నార న్నారు. ఓసీపీలో పేల్చే బత్తి దెబ్బలకు ఇళ్లు బీటలు వారుతున్నాయని తెలిపారు. ఇప్పటికే ఆరు ఇళ్లు కూలిపోయాయని తెలిపారు. దుబ్బగూడెం వాసులు భయంతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. వెంటనే పునరావాస కాలనీ పనులను పూర్తి చేయాల న్నారు. నిర్వాసిత గ్రామంలోని యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం తెచ్చిన ఆర్‌అండ్‌ఆర్ పాలసీని సమర్థవంతంగా అమలు చేసి భూ నిర్వాసితులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బాబన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గోనెల శ్రీనివాస్, మంచిర్యాల పట్టణా ధ్యక్షుడు సిరాజ్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠ క్రతువు ప్రారంభం



యాగం నిర్వహిస్తున్న పురోహితులు

నెన్నెల, మార్చి 18: మండల కేంద్రంలో పునర్నిర్మించిన పురాతన గంగాధర ఆలయంలో శివ పంచాయతన నవగ్రహ శిఖర, యంత్ర మూర్తి స్థిర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ గట్టు నరహరశర్మ అవధాని ఆధ్వర్యంలో బ్రాహ్మనోత్తములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు క్రతువు కొనసాగుతుందని చెప్పారు. గణపతి పూజ, పుణ్యాహవాచనము, నాంది, జడాహవాచనము, పంచగవ్య ప్రాశనము, ఆచార్యాధి రుతిగ్వరణము, షోడశస్థంభ నిర్మిత పర్యగ్ని కరణ పూర్వక యజ్ఞశాల ప్రవేశం చేశారు. అఖండ దీపారాధన, అంకురార్పణ, నవగ్రహ, వాస్తు యోగినీ, క్షేత్రపాలన, బ్రహ్మాది మండల దేవస్థాన ములు, కుండ సంస్కార పూర్వక అగ్నిప్రతిష్ఠాపనము, జలాధివాసము, హారతి, మహా మంత్ర పుష్పం, చతుర్వేది సేవా తీర్థప్రసాద వితరణ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

జైపూర్, మార్చి 18 : గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత పేర్కొన్నారు. సోమవారం ఇందారం గ్రామంలోని నజీర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందుతుందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీదేవి బోనాలు

- ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ప్రత్యేక పూజలు



బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

భీమారం, మార్చి 18: మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలోకొలువైన లక్ష్మీదేవి అమ్మవారి బోనాల పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి బోనాలను సమర్పించారు.. ముదిరాజ్ కాలనీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పెద్దపట్నం కార్యక్రమం ఆకట్టుకుంది. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని పలు సమస్యలను కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమిటీ సభ్యులు తెలియజేసిన సమస్యలను పరిష్కరి స్తానని హామీ ఇచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ టీసీ భుక్య తిరుమల, నాయకులు మూల రాజిరెడ్డి, చేకుర్తి సత్యనారాయ ణరెడ్డి, పోడేటి రవి, లక్ష్మణ్, రాంరెడ్డి, ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మధు, కొమురయ్య, స్వామి, రమేశ్, సారయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు కల్పించాలి

- అదనపు కలెక్టర్ బి రాహుల్

నెన్నెల, మార్చి 18: పార్లమెంట్ ఎన్నికల కోసం పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేసి సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మండలంలోని మైలారం పోలింగ్ స్టేషన్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటేసే విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. పురుషులు, మహిళా ఓటర్ల సంఖ్య ఆధారంగా వేరువేరుగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు, ఓటర్లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలు, గతంలో ఎన్నికల్లో పోలింగ్ శాతం వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ముందస్తుగా గ్రామాలను సందర్శిస్తున్నట్టు చెప్పారు. వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సబ్బ రమేశ్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నరేష్, ఎంఆర్‌ఐ గణేష్, గ్రామ కార్యదర్శులు, బీఎల్‌వోలు ఉన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ

దండేపల్లి, మార్చి 18: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం కెనర బ్యాంక్ సౌజన్యంతో సోమవారం రూ. 25వేల విలువ గల క్రీడా సామగ్రిని బ్యాంక్ అసిస్టెంట్ జోనల్ మేనేజర్ కేఎస్ మాధవి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు.

విలేకరిపై దాడి చేసిన ఇద్దరి అరెస్టు

చెన్నూరు, మార్చి 18: వారం రోజుల క్రితం పట్టణంలోని ఓ పత్రిక విలేకరి వెంకటరాజంపై దాడి చేసిన ఇద్దరు నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు సోమవారం కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఈ నెల 11న కొత్త బస్టాండ్ ప్రాంతంలోని ప్రెస్‌క్లబ్‌లో ఇరువురు గుర్తుతెలియని వ్యక్తులు ప్రెస్‌క్లబ్‌లోకి ప్రవేశించి ప్రెస్‌క్లబ్‌లో ఉన్న వెంకటరాజంపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారన్నారు. నేరస్తుల్లో ఒకడైన మేకల రమేశ్‌కు వరుసకు చెల్లెలు అయిన మైనర్ ఇంటర్ పరీక్షల నిమిత్తం అరుణక్కనగర్ నుంచి చెన్నూరుకు వచ్చి రోజు పరీక్షలకు హాజరవుతుందన్నారు. ఈ క్రమంలో బస్టాండ్ ప్రాంతం లోని ప్రెస్‌క్లబ్‌లో ఉన్న విలేకరి వెంకటరాజం ఆ అమ్మాయిపై వేధింపు లకు పాల్పడ్డాడని అన్నారు. దీంతో ఆ అమ్మాయి రమేశ్‌కు ఈ విషయం చెప్పిందని తెలిపారు. రమేశ్ తనస్నేహితుడు గుర్రం రాజేష్‌తో కలిసి దాడి చేశారని చెప్పారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా ఇద్దరిని గుర్తించి పట్టుకున్నామని సీఐ తెలిపారు.

ఎస్పీఎం గోడల కూల్చివేత

● **మున్సిపల్ సిబ్బందితో యాజమాన్యం వాగ్వాదం**

● **కొనసాగిన పనులు, పరిశీలించిన ఎమ్మెల్యే**



కూల్చివేతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, మార్చి 18: కాగజ్‌నగర్ ఎస్పీఎం యాజమాన్యం ప్రధాన రహదారికి అడ్డంగా నిర్మించిన గోడలను మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం కూల్చివేశారు. మాస్టర్‌ప్లాన్ అమలులో భాగంగా మూడునెలల క్రితం జిల్లాకలెక్టర్ తోపాటు ఎస్పీఎం యాజమాన్యానికి మున్సిపల్ కమిషనర్ నోటీసులను పంపించారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులు తొలగించాలని సూచించినప్పటికీ యాజమాన్యం పెడచెవిన పెట్టింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా రోడ్డు వెడల్పు కోసం గోడలను తొలగించింది. మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్, కౌన్సిలర్లు గోడల కూల్చివేతను పరిశీలించారు. అలాగే సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కూడా సంఘటన స్థలానికి చేరుకొని మున్సిపల్ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు.

ఉద్రిక్తంగా మారిన పరిస్థితి..

ఎస్పీఎం గోడల కూల్చివేస్తున్న సమయంలో ఎస్పీఎం వైస్‌ప్రెసిడెంట్ ఏకే మిశ్రా సంఘటన స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నామని పనులను నిలిపివేయాలన్నారు. కొంతమంది ఎస్పీఎం కార్మికులు మున్సిపల్ సిబ్బందితో వాదనకు దిగారు. పరిస్థితి చేజారుతుండటంతో ఎస్పీఎం ప్రతినిధులు కార్మికులకు నచ్చజెప్పారు. అనంతరం పనులు యధావిధిగా కొనసాగటంతో రహదారికి లైన్‌క్లియర్ అయి సమస్య సద్దుమణిగింది.



గోడల కూల్చివేత నిర్వహిస్తున్న అధికారులు

డీఎస్పీ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా



డీఎస్పీ కార్యాయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

కాగజ్‌నగర్, మార్చి 18: ఐదు రోజుల క్రితం కాగజ్‌నగర్ మండలం నామనగర్‌లో జరిగిన సాయికుమార్(18) హత్యకేసును విచారణ జరిపి న్యాయం చేయాలని సాయికుమార్ కుటుంబ సభ్యులు సోమవారం డీఎస్పీకార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ కుటుంబసభ్యులు మాట్లాడుతూ తమ కుమారుడు చనిపోయి ఇప్పటికీ వారం రోజులు గడిచిందన్నారు. ఇంతవరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. హత్య జరిగినట్టు ఆనవాళ్లు స్పష్టంగా ఉన్నప్పటికీ కేసును నీరుగారుస్తుండటం దారుణమన్నారు. తమకు న్యాయంజరగకుంటే ఊరుకునేది లేదన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి హంతకులను కఠినంగా శిక్షించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. విషయంలో తెలుసుకున్న పట్టణ సీఐ శంకరయ్య వెంటనే ధర్నా వద్దకు హంతకులను పట్టుకుని శిక్ష విధిస్తామని పేర్కొనడంతో కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు.

లోక కల్యాణార్థం అయోధ్యకు పాదయాత్ర

ఆసిఫాబాద్, మార్చి 18: లోక కల్యాణార్థం కర్ణాటక రాష్ట్రం ఉడిపికి చెందిన లక్ష్మీపతిస్వామి అయోధ్యకు చేపట్టిన పాదయాత్ర సోమవారం ఆసిఫాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కాండ్రె విశాల్, గణేష్, శ్రావణ్‌గౌడ్ పూలమాలలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిస్వామి మాట్లాడుతూ లోక కల్యాణార్థం 2016లో ఉడిపి నుంచి పాదయాత్రగా అయోధ్యకు బయలుదేరానని తెలిపారు. రోజుకు 30కిలోమీటర్ల మేర తన పాదయాత్ర కొనసాగుతుందని ఇప్పటి వరకు 20వేల కిలోమీటర్ల పాదయాత్ర పూర్తైందన్నారు. మరోమూడునెలల్లో అయోధ్యకు చేరుకుంటాననిస్వామిజీ పేర్కొన్నారు.

పోషణ పక్షోత్సవాలు

దహెగాం, మార్చి 8: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణపక్షోత్సవాలు నిర్వహించారు. చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారపదార్థాలను తీసుకుంటే మంచిపోషకాలు లభిస్తాయని తెలిపారు. రాగులు, సజ్జలు, కొర్రలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే రక్త హీనతను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ రజిత, పద్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బీఎస్పీకి రాజీనామా చేస్తున్నాం

● **రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి**

కాగజ్‌నగర్, మార్చి 18: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజీనామా చేసిన నేపథ్యంలో తాము కూడా పార్టీకిరాజీనామా చేస్తున్నట్టు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి తెలిపారు. సోమవారం తననివాసంలో ఆయన మాట్లాడారు. తనతోఉన్నక్యాడర్, తామంతా మూకుమ్మడిగా రాజీనామాలు చేసినట్టు తెలిపారు. త్వరలోనే ఏపార్టీలోచేరుతామనే విషయాన్నిప్రకటిస్తామన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: బీఎస్పీకి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయనకు మద్దతుగా రాజీనామా చేస్తున్నట్లు జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నాయకత్వంతో ఆయన విభేదించి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆర్‌ఎస్పీ వెంటే తాము పార్టీకి రాజీనామా చేశామన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

చింతలమానేపల్లి, మార్చి 18: మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన ఆకిరెడ్డి పోశం తన సోదరి ఈ నెల 16న ఇంటిని వెళ్లి తిరిగి రాలేదన్నాడు. తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభ్యం కాలేదన్నాడు. ఈమేరకు పోశం ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ సాదిక్ పాషా తెలిపారు.

గుడుంబా పట్టివేత

చింతలమానేపల్లి, మార్చి 18: మండలంలోని హేటిగూడ గ్రామంలో సోమవారం లోడెల్లి శ్రీనివాస్ దుకాణంలో తనిఖీచేయగా 4లీటర్ల గుడుంబా పట్టుబడినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

వారసంత వేలం వాయిదా

సిర్పూర్(టి), మార్చి 18: సిర్పూర్(టి)లో నిర్వహించే వారసంతకు సోమవారం వేలంపాట నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఈవో కృష్ణమూర్తి తెలిపారు. తిరిగి నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు. కాగాఈనెల21న హుడ్కిలిలో పశు పులసంతకు వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు.





ఈ-కేవైసీ చేస్తేనే లబ్ధి

● అవగాహన లేక నష్టపోతున్న రైతులు
● అర్హులైన రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలంటున్న అధికారులు

వాంకిడి, మార్చి 18: సరైన అవగాహన లేపోవడంతో రైతులు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మన్ నిధి పథకం లబ్ధి పొందలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులను సాగులో ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకంలో భాగంగా రైతులకు సంవత్సరానికి రూ.6వేల చొప్పున మూడుదఫాలుగా నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమఅవుతుంది. పలువురు రైతులకు ఈపథకంపై పూర్తి అవగాహన లేక పోవడంతో పాటు ఇద్దరు ముగ్గురు ఆధార్‌కార్డులకు ఒకే ఫోన్‌నంబర్లు, ఇవ్వడం, ప్రస్తుతం అవి వినియోగంలో లేకపోవడం, ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్లు లింక్ కాకపోవడం, బ్యాంకుఖాతాకు ఆధార్ అనుసంధానం కాక పోవడం వంటి కారణాలతో రైతులకు సమ్మాన్ నిధి నగదు అందడంలేదు. రైతులు ఈ-కేవైసీ చేసుకుంటే వచ్చే దఫా వీరందరికి ప్రయోజన చేకూరనుంది. జిల్లాలో 67,995మంది రైతులు ఉండగా 63,365మంది రైతులు ఈకేవైసీ చేసుకున్నారు. ఇంకా 4,630మంది రైతులు ఈకేవైసీ చేయించు కోవాల్సి ఉంది. దీంతో పాటు 2149 మంది రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ చేసుకోవాల్సి ఉంది.

నిబంధనలు ఇలా..

- 2019 ఫిబ్రవరి 1వ తేదీలోపు పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులందరూ ఈ పథకానికి అర్హులు. వీరు ఏఈవోల ద్వారా కానీ.. మీసేవా కేంద్రాల ద్వారా కానీ.. నేరుగా సెల్‌ఫోన్‌లోనూ ఈ -కేవైసీ చేయించుకోవచ్చు.
- రైతుల బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి. బ్యాంకు ఖాతాతో పాటు ఆధార్ కార్డుకు ప్రస్తుతం పని చేసే ఒకే ఫోన్ నంబర్‌ను లింక్ చేయాల్సి ఉంటుంది.
- ఈ-కేవైసీ చేయించుకున్న తురువాత రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రాకపోతే బ్యాంకు లోనూ రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి.

జిల్లాలో ఈకేవైసీ చేయించుకోని రైతుల వివరాలు మండలాల వారీగా

మండలాలు	రైతులు	ఈ కేవైసీ చేసుకోనివారు	ఈ కేవైసీ చేసుకున్నవారు
ఆసిఫాబాద్	6,720	6478	242
బెజ్జూర్	5312	4996	316
చింతలమానెపల్లి	4476	4113	363
దహేగాం	5140	4890	250
జైనూర్	4667	4188	479
కాగజ్‌నగర్	6670	6234	436
కెరమెరి	4095	3746	349
కౌటాల	3952	3889	63
లింగాపూర్	3403	3190	213
పెంచికల్‌పేట్	2799	2746	53
రెబ్బెన	4859	4304	555
సిర్పూర్(టీ)	3623	3246	377
సిర్పూర్(యు)	3437	3070	367
తిర్యని	3753	3576	177
వాంకిడి	5089	4699	390

అధికారిక వెబ్‌సైట్‌లో..

httpr//pmkisan.govt.in సైట్‌లో అందుబాటులో ఉన్న ఈ-కేవైసీ పై క్లిక్ చేయండి. ఆధార్ కార్డు నెంబర్ క్యాప్చా కోడ్‌ను నమోదు చేసి సెర్చ్‌పై క్లిక్ చేయాలి. ఆధార్ కార్డుతో లింక్ చేసిన ఫోన్ నెంబర్‌ను నమోదు చేయాలి. వివరాలు సరిపోలితేనే ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తవుతుంది. లేకుంటే అది చెల్లనిదిగా కనిపిస్తుంది. అలాంటి సందర్భాల్లో క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి ఈ-కేవైసీ చేయించుకోవాలి.

అర్హులైన వారు ఈకేవైసీ చేయించుకోవాలి

మిలింద్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి



ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి కోసం రైతులు ఈకేవైసీ చేసుకోవడంలో జాప్యం చేస్తున్నారు. జిల్లాలో ఇంకా 4630మంది రైతుల ఈ కేవైసీ చేపెండింగ్‌లో ఉంది. అర్హులైన రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించు కోవాలి. రైతులకు అవగాహన కల్పిస్తున్నా స్పందించడం లేదు. వాంకిడి మండలంలో 390 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. రైతులు సంబందిత ఏఈవోల వద్ద ఈకేవైసీ చేసుకుంటేనే వారికి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధి చేకూరుతుంది.

ప్రశాంతంగా ప్రారంభమైన 'పది' పరీక్షలు



ఆసిఫాబాద్‌లో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 18: పదవ తరగతి పరీక్షలు సోమవారం జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 6457 మంది విద్యార్థులకు 6408 మంది విద్యారులు హాజరు కాగా 49 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 37పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. పట్టణంలోని పీటీజీ, జిల్లా పరిషత్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ వెంకటేష్ దోత్రే పరిశీలించారు. అలాగే జిల్లా పరిషత్ బాలికల పరీక్షాకేంద్రాన్ని ఎస్పీ సురేష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి తగు సూచనలుచేశారు. పరీక్షాకేంద్రాలవద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పరీక్షల పర్యవేక్షణాధికారికి, పోలీసు అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా అన్నిపరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉన్నట్లు, 144సెక్షన్ అమలులో ఉందని తెలిపారు.

కాగజ్‌నగర్/తిర్యాణి/వాంకిడి/బెజ్జూరు/చింతలమానేపల్లి/దహెగాం/సిర్పూర్(టి)/పెంచికలపేట/కెరమేరి/జైనూరు/సిర్పూర్(యు): మండలాల్లో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్ద ఇన్విజిలేటర్లు విద్యార్థులను ఉదయం 8.30గంటలకే తనిఖీచేసి లోనికి పంపించారు. పరీక్షా కేంద్రాలను పలువురు అధికారులు సందర్శించారు. మాస్ కాపియింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. తిర్యాణి, వాంకిడి, సిర్పూర్(టి), కెరమెరిలలో ఇద్దరు చొప్పున, దహెగాం, జైనూరు, సిర్పూర్(యు)లో ఒకవిద్యార్థి చొప్పున పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పెంచికలపేటలో విద్యార్థులకు జూస్ పంపిణీ చేశారు.

గ్రేహౌండ్స్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, మార్చి 18: పోలీసు సిబ్బందికి వారంరోజుల పాటు నిర్వహించే గ్రేహౌండ్స్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పీసురేష్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది శారీరక దారుఢ్యం కోసం, మావోయిస్టుల కదిలికలపై ప్రత్యేకనిఘా కోసం ఈశిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షలో భాగంగా పోలీసు సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలు, మెలకువలు నేర్చుకోవడానికి ఉపయోగ కరంగా ఉంటుందని తెలిపారు. పార్లమెంట్‌ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చెక్‌పోస్టుల వద్ద డ్యూటీలు, వాహనాల ముమ్మరతనిఖీలు, ఇతర విధుల నిర్వహణకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, సీఐ సతీష్, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీకి జిల్లా జట్టు



వాహనానిన జెండా ఊపి ప్రారంభిస్తున్న మీనారెడ్డి

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 18: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని బోయినపల్లి వాటర్‌స్పోర్ట్స్ అకాడమిలో నిర్వహిస్తున్న 5వతరగతిలో ప్రవేశ పరీక్ష కోసం జిల్లా జట్టు పాల్గొన్నట్లు గిరిజన సంక్షేమ క్రీడాధికారిణి మీనారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రత్యేకవాహనంలో 10మందిబాలికలు తరలివెళ్లగా జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులను కోచ్‌లు మీనారెడ్డి, మంగాపతి, సుమ, ఏటీడీవో క్షేత్రయ్య, ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, పెటా సెక్రెటరీ కృష్ణమూర్తి, హెచ్‌డబ్ల్యూవో విజయశాంతి, పీడీలు అభినందించారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశానికి డ్రా పద్ధతిలో ఎంపిక

ఆసిఫాబాద్, మార్చి 18: విద్యా సంవత్సరం 2024-25నికిగాను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశానికి అర్హత గల విద్యార్థులను ఎంపికచేశామని అదనపు కలెక్టర్ దాసరి వేణు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ ఉపసంచాలకుడు సజీవన్‌తోకలిసి డ్రా పద్ధతిన ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు ఉచితవిద్యాభ్యాసానికి 1వతరగతిలో ప్రవేశాలకు జిల్లా నుంచి ఒక విద్యార్థిని లక్కీడ్రాద్వారా ఎంపిక చేశామని అన్నారు. కాగజ్‌నగర్ మండల కేంద్రానికి చెందిన ఆర్యన్ గవాడి ఎంపిక కాగా వెయిటింగ్ లిస్టులో బెండారే హిమ్మాన్, దుర్గం భవ్యస్ ఉన్నారని తెలిపారు.

కాగజ్‌నగర్‌లో విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 18: గ్లోబల్ రీసైక్లింగ్ డేను పురస్కరించుకొని కాగజ్‌నగర్ ఎస్పీఎం, స్పర్శ సేవాసమితి ఆధ్వర్యంలో వసుంధర డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్పర్శసేవాసమితి ఫీల్డుఅధికారులు అశోక్, సుందరం మాట్లాడుతూ ప్లాస్టిక్‌రహిత సమాజం కోసం అంతా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిరత్కర్, విద్యార్థులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

రేపు వారసంతకు వేలం

కౌటాల, మార్చి 18: మండలకేంద్రంలో ప్రతి వారం నిర్వహించే వారసంత, పశువుల సంతకు వేలంపాట ఈనెల20న నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు సమావేశానికి హాజరు కావాలన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

దహెగాం, మార్చి 18: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూసన్మార్గంలో నడుచుకోవాలని ఎస్సై రాజు అన్నారు. సోమవారం మండలంలోని కోత్మీర్‌లో ఆయన మాట్లాడాతూ గ్రామాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పెంచికలపేట, మార్చి 18: ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని పలు బెల్టుషాపులను తనిఖీచేసి కొన్ని సరుకులను స్వాధీన పర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధన ప్రకారం ఎవరూ కూడా సరైనధ్రువపత్రాలు లేకుండారూ.50 వేలకు పైగా డబ్బులు పట్టుకొని ప్రయాణించరాదన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత

చింతలమానేపల్లి, మార్చి 8: మండలంలోని డబ్బా గ్రామ యువకులకు శివరామసాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్ వాలీబాల్‌కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో యూత్‌సభ్యులు ప్రకాష్, పురుషోత్తం, సందీప్, అరుణ్ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో కార్యదర్శుల నిరసన

బెజ్జూరు, మార్చి 18: నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల ఎంపీవోపై దాడిచేసిన ఎంపీపీపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్యదర్శులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. సంఘం మండల గౌరవఅధ్యక్షుడు రాములు మాట్లాడుతూ విధి నిర్వహణలో అధికారులపై దాడికిపాల్పడ్డ ప్రతినిధిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పకడ్బందీగా తనిఖీ చేయాలి

బెజ్జూరు, మార్చి 18: సార్వత్రిక ఎన్నికలవేళ పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. సోమవారం మండలంలోని సోమిని సమీపంలోని ప్రాణహితనది వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రూ.50వేలకంటే అధికంగా ఎలాంటిపత్రాలు లేకుండా నగదు పట్టుబడితే సీజ్‌చేయాలని సూచించారు. ఎంపీవో రమేష్‌రెడ్డి, సోహెల్ అహ్మద్ ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రె



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రె

ఆసిఫాబాద్, మార్చి 18: లోక్‌సభ ఎన్నికలు 2024ను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేష్‌కుమార్, జిల్లా అటవీఅధికారి నీరజ్ టిబ్రివాల్, అదనపుకలెక్టర్ దాసరివేణుతో కలిసి నోడల్ అధికారులతో ఎన్నికలనిర్వహణపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలలోభాగంగా సిర్పూర్‌లో 320పోలింగ్ కేంద్రాలు, ఆసిఫాబాద్‌లో 356పోలింగ్ కేంద్రాలు, సహాయక పోలింగ్‌కేంద్రాలతో కలిపి మొత్తం 676పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటికి బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లను నియమించామన్నారు. జిల్లాలో 2,26,994 మంది పురుషులు, 2,28,45 మంది మహిళలు, 28మంది ట్రాన్స్‌జెండర్లు, 404సర్వీస్ ఓటర్లు, 80సంవత్సరాల పైబడినవృద్ధులు 5,556మంది, దివ్యాంగులు 6,931మంది ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 9స్టాటిక్ సర్వేయలెన్స్ టీంలు, 8ఫ్లయింగ్ స్క్వాడ్‌బృందాలు, 9వీడియో సర్వేలెన్స్ టీంలు, రెండు వీడియోపరిశీలన బృందాలు, 8మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, 2అకౌంటింగ్ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఏప్రిల్ 18న ఎన్నికల సంబంధిత గెజిట్‌నోటిఫికేషన్ విడుదల, 25న నామినేషన్లు దాఖలు, 26న పరిశీలన, 29న ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్, జూన్ 6న ఎన్నికలప్రక్రియ ముగుస్తుందని అన్నారు. అప్పటి వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎన్నికలనిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం, జిల్లా గ్రీవెన్స్‌కమిటీ, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమటీలను ఏర్పాటు చేశామన్నారు. నియమావళి అమలులోకి వచ్చినందున రాజకీయ సంబంధిత హోర్డింగ్‌ల తొలగింపు, రూ.50 వేల కంటే అధికంగా నగదుతరలిస్తే సీజ్ చేస్తామన్నారు. కలెక్టరేట్‌లో 1950కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులపై స్పందించాలని తెలిపారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

జిల్లాలోపార్లమెంట్ ఎన్నికలుసజావుగా సాగేందుకు రాజకీయపార్టీలు, పోటీచేయూ అభ్యర్థులు సహకరించాలని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, ఖర్చులు తదితరఅంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 6న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని అన్నారు. అప్పటివరకు ఎన్నికలప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. నామినేషన్ స్వీకరించే సమయంలో సీసీకెమెరాలతోపాటు వీడియో చిత్రీకరణ ద్వారా రికార్డు చేస్తామన్నారు. నిర్ణీత సమయంలోగా నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు. ఎన్నికల సంబంధిత ఖర్చుల నిర్వహణకు నామినేషన్ దాఖలు చేయడానికి ముందు ప్రత్యేకబ్యాంకుఖాతా తెరవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అందరూ పాటించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు.

స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి..

లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తును అదనపుకలెక్టర్ వేణు, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రర్తనా నియమాళి అమలు చేస్తామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నగదు పట్టివేత

సిర్పూర్(టి), మార్చి 18: మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో రూ.8,76,303లను పట్టుకున్నట్లు ఎస్సై దీకొండరమేష్, చెక్‌పోస్టు సిబ్బందితెలిపారు. ఇందులో రూ.5లక్షలను డబ్బాగ్రామానికి చెందినవ్యక్తి మహారాష్ట్ర చంద్రాపూర్‌కు పట్టుకెళ్లతుండగా, అలాగే మరోవ్యక్తి మహారాష్ట్ర నుంచి రూ.2,29,000నగదును తీసుకువస్తుండగా, అలాగే మరోవ్యక్తి వద్ద 17మిక్సీలు పట్టుబడినట్లు తెలిపారు. నగదుతో పాటు మిక్సీలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు రైతులకు పంటల సాగుపై అవగాహన

సిర్పూర్(టి), మార్చి 18: మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం శాస్త్రవేత్తలు పంటలసాగుపై రైతులకు సూచనలు సలహాలు ఇస్తారని వ్యవసాయ శాఖా ధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 10నుంచి 11.30గంటల వరకు డాక్టర్ బిశ్రీనివాస్ జగిత్యాల నుంచి రైతులకు సూచనలు అందజేస్తారన్నారు. ఆయిల్ పామ్ సాగులో తీసుకోవాల్సిన మెలకువలను డాక్టర్ రాజశేఖర్, కొండా లక్ష్మణ్ అందజేస్తారని అన్నారు. అలాగే డాక్టర్ కె కవిత రైతులకు సందేహాలకు సమాధానం ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి పాల్గొంటారన్నారు.

డిపోను సందర్శించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్



ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్, మార్చి 18: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోమవారం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోను సందర్శించారు. మహారాష్ట్రలోని తడోబాకు వెళ్లి తిరుగుప్రయాణంలో ఆసిఫా బాద్ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఎండీకి డీఎం విశ్వనాథ్‌తోపాటు సిబ్బంది, కార్మికులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎండీ సజ్జనార్ కార్మికులతో, అధికారులతో మాట్లాడుతూ కార్మికులు విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణికులపట్ల గౌరవంగా ఉండాలని సూచించారు. ఆర్టీసీని లాభాల బాటలో తీసుకు వచ్చేందుకు ప్రతికార్మికుడు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీఅధికారులు,సిబ్బంది,కార్మికులు పాల్గొన్నారు.

ఆదివాసుల సంస్కృతి గొప్పది



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, మార్చి 18: ఆదివాసుల సంస్కృతి చాలా గొప్పదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని షేకుగూడ, సుకుడ్‌పెల్లి తదితర గ్రామాల్లో సోమవారం జరిగిన వివాహ వేడులకు ఆమె హాజరయ్యారు. ఈసందర్భంగా వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆమె మాట్లాడుతు ఆది వాసులు తమ సంస్కృతీ సంప్రదా యాలను భావితరాలకు ప్రసరింపజేసేలా కృషి చేయాలని కోరారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్‌రావ్, జైనూరు, సిర్పూర్ (యు) మండలాలపార్టీ అధ్యక్షులు ఇంతీయాజ్ లాల, తోడ్సం ధర్మారావ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



సీనియారిటీ ప్రాతిపదికన క్వార్టర్ల కేటాయింపు

మందమర్రిటౌన్, మార్చి 18: సీనియారిటీ ప్రాతిపదికన సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయిస్తున్నామని ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సీఈఆర్‌క్లబ్‌లో ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు క్వార్టర్ల కోసం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 45క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయని నోటీసు వేయగా 45మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు.

ఐఎన్‌టీయూసీ పిట్ కమిటీ

జైపూర్, మార్చి 18: ఐఎన్‌టీయూసీ పిట్‌కమిటీని నియమించినట్లు జనరల్ సెక్రెటరీ జనక్‌ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీపీపీ పిట్‌సెక్రెటరీగా జి శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్‌సెక్రటరీలుగా మధు కుమార్, సదాశివకృష్ణ, ఆర్గనైజింగ్‌సెక్రెటరీగా అజయ్‌కుమార్, కమిటీ మెంబర్లుగా మహేశ్, శివశంకర్, సదానందం, రాజేష్, అడ్మిన్ బిల్డింగ్ ఇన్‌చార్జీగా రాకేష్‌ను నియమించినట్లు తెలిపారు. నియామకపత్రాన్ని ఎస్టీపీపీ జీఎం బసివిరెడ్డికి అందజేశామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ఉచిత శిక్షణ

శ్రీరాంపూర్, మార్చి 18: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా ఆధ్వర్యంలో యువతకు ఉచితంగా స్కిల్‌డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వనున్నట్లు డీజీఎం (పర్సనల్) పి అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాస్మటాలజీ, డ్రోన్ టెక్నాలజీ, సోలార్ టెక్నీషియన్, సెల్‌ఫోన్ టెక్నీషియన్, టూవీలర్ మెకానిక్, ఆర్క్‌అండ్‌గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ అండ్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, తదితర కోర్సుల్లో ఎస్ఎస్‌సి ఫెయిల్/పాస్, డిగ్రీ, డిప్లొమా, ఐటిఐ చదివిన సింగరేణి ప్రాంత యువత దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ నెల 30లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసి, అర్హత పత్రాలను వృత్తి శిక్షణ కేంద్రంలో అందిస్తే శిక్షణ ఏర్పాట్లు చేస్తామని వివరించారు.

గోలేటి ఎస్ఈగా షేక్ మదీనా బాషా

రెబ్బెన, మార్చి 18: బెల్లంపల్లి ఏరియా గోలేటి ఎస్ఈ(సివిల్)గా షేక్ మదీనాబాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను సివిల్‌ఈఈ రాజేంద్రప్రసాద్, మనోజ్, బెల్లంపల్లి ఏరియాసివిల్ కాంట్రాక్టర్స్ హైడిదర్, తదితరులు ఘనంగా సన్మానించారు.

సరియైన పరికరాలు లేకపోవడంతోనే రాజు దుర్మరణం



రాజు మృతికి సంతాపం తెలుపుతున్న నాయకులు

మందమర్రి టౌన్, మార్చి 18: మంద మర్రి ఏరియాస్టోర్స్‌లో మూడురోజుల క్రితం రాజు మృతిచెందిన ఘటన అధికారుల నిర్లక్ష్యం వల్లనే జరిగిందని అఖిలపక్షం యూనియన్ నాయకులు గాండ్ల సంపత్, కంది శ్రీనివాస్, ఐఎన్టీయూసీ నాయకులు నరేందర్, మిట్ట సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఏరియాలోని కేకే5 గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడుతూ రక్షణకు సంబంధించి స్టోర్స్‌లో పరికరాలు లేకపోవడం వల్లనే రాజు మృతి చెందాడని తెలిపారు. ఆ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. రక్షణ చర్యలు చేపడుతున్నామని చెబుతున్న యాజమాన్యం సరియైన పరికరాలు ఎందుకు ఉంచలేదో చెప్పాలన్నారు. రాజు భార్యకు సూటబుల్ జాబ్ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులు సోముశెట్టి రాజేషం, అలుగుల రవి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుని మృతి బాధాకరం: సలేంద్ర సత్యనారాయణ

కర్రె రాజు మృతిచెందడం బాధాకరమని గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. సోమవారం ఏరియాస్టోర్‌లో రాజు మృతికి సంతాపం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షణ ప్రతిజ్ఞ చేయించడం కాదని రక్షణ పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమనాథుని సుదర్శన్, బానయ్య, సత్యనారాయణ, శర్మ,మర్రికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంతాపం

కాసిపేట: కర్రె రాజు మృతికి సోమవారం కార్మికసంఘాల నాయకులు, అధికారులు సంతాపం తెలిపారు. మౌనం పాటించారు. నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏజెంటు రాందాస్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, పిట్ కార్యదర్శి శ్రీను, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

గనిపై కార్మికుల ఆందోళన

కాసిపేట, మార్చి 18: మందమర్రి డివిజన్ పరిధిలోని కాసిపేట 2వ గనిలో రక్షణ చర్యలు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం కార్మికులు విధులు బహిష్కరించి గని మేనేజర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల రక్షణపై చూపెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన మూడు నెలల్లో ఇద్దరు కార్మికులు ప్రమాదాల బారిన పడి మృతిచెందడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రక్షణాధికారి సంతోష్‌రావు కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. అనంతరం గని గ్రూపు ఏజెంటు రాందాస్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ గనిలో రక్షణ చర్యలు చేపడతామని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోండి

శ్రీరాంపూర్, మార్చి 18: జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లును శ్రీరాంపూర్ జీఎం బి సంజీవరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి గనులు, విభాగాల్లో జరుగుతున్న దొంగతనాలపై చర్చించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. దొంగతనాలు జరగకుండా కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో శ్రీరాంపూర్‌సీఐ మోహన్, మురళీ మోహన్ పాల్గొన్నారు.